క్లుప్తంగా

మంత్రి కాకాణికి కృతజ్ఞతలు



నెల్లూరు (వేదాయపాళెం): జిల్లాలోని దళిత, గిరిజన, మైనార్టీల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి అభివృద్ధికి కృషి చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ సమితి అధ్యక్షుడు కాకి శ్రీనివాసులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని దళితుల సమస్యలను మంత్రి కాకాణి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే సానుకూలంగా స్పందిస్తూ వారికి అండగా నిలవడం సంతోషకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పథకాల లబ్ధిదారుల్లో అధిక శాతం దళితులే ఉండడం సంతోషకరమన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు దళిత నేతలపై పెట్టిన అక్రమ కేసులను ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎత్తివేశారని తెలిపారు. దళితుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికి దళితులు అండగా ఉంటారన్నారు. ఎమ్మార్పీఎస్ నేతలు బద్దేపూడి వెంకట్రావ్, తాటిపర్తి రఘు, చిన్నయ్య పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ కార్మికులకు హెల్త్ కార్డులు



నెల్లూరు(బారకాసు): నగర పాలక సంస్థలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులకు హెల్త్ కార్డులు జారీ చేసినట్లు కమిషనర్ వికాస్‌మర్మత్ తెలిపారు. ఆప్కాస్ విజయవాడ వారిచే ఈఎస్ఐ, ఈపీఎఫ్ సమస్యలకు పరిష్కారం అందించే ప్రత్యేక కార్యక్రమాన్ని నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సంబంధించి చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న ఈఎస్ఐ, ఈపీఎఫ్ సమస్యలకు సత్వర పరిష్కారం అందించినట్లు తెలిపారు. జాయింట్ డిక్లరేషన్స్(ఈపీఎఫ్ కరెక్షన్), ఈఎస్ఐ హెల్త్‌కార్డులను అందజేశామని తెలిపారు. ఆప్కాస్ జనరల్ మేనేజర్ నాగప్రసాద్, కార్పొరేషన్ సూపరింటెండెంట్ పద్మజ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డీసీసీబీ రామూర్తినగర్ బ్రాంచ్ మేనేజర్ శ్రీధర్ ఆధ్వర్యంలో చింతారెడ్డిపాళెం, అల్లీపురం గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం అవగాహన కల్పించారు. బ్యాంకు సూపర్‌వైజర్లు బాబు,సుష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐఈఏ సెక్రటరీ జనరల్‌గా డాక్టర్ బిందుమీనన్



నెల్లూరు(బారకాసు): ఇండియన్ ఎపిలెప్సి అసోసియేషన్(ఐఈఏ) సెక్రటరీ జనరల్‌గా డాక్టర్ బిందుమీనన్ ఎన్నికయ్యారు. జైపూర్‌లో జూలై 23న జరిగిన ఎపిలెప్సీ ఈకాన్ జాతీయ సదస్సులో ఐఈఏ ఎన్నికల ఫలితాలను వెల్లడించి నియామక పత్రాన్ని అందజేసినట్లు బుధవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఆస్పత్రిలో న్యూరాలజిస్ట్ సీనియర్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న తాను మూర్ఛ రోగుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఐఈఏ సెక్రటరీ జనరల్ పదవి ప్రతిష్టాత్మకమైందని, బాధ్యతాయుతమైందని, మూర్ఛ వ్యాధికి సంబంధించిన కారణాల అన్వేషణ కోసం అంకితభావంతో పనిచేయాలని తాను యోచిస్తున్నానని ఆమె పేర్కొన్నారు.

డీసీసీబీ సీఈఓకు సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు డీసీసీబీ రాష్ట్రస్థాయిలో ప్రతిభకనబర్చి రెండు నాబార్డు అవార్డులను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా నగరంలోని డీసీసీబీ కార్యాలయంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కుమార్‌పాల్ ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు నిర్వహించారు. డీసీసీబీ సీఈఓ శంకర్‌బాబును శాలువాతో సత్కరించారు. బ్యాంకు జనరల్ మేనేజర్ సరిత, డీజీఎం మధు, ఏజీఎంలు శ్రీనివాసులరెడ్డి, కృష్ణ, యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి ప్రజ్ఞ, జిల్లా నాయకులు సుష్మారెడ్డి, గాయత్రి, సాజిదా, శ్రీవిద్య, నళిని, షర్మిల, వరలక్ష్మీ, రేచల్, క్రాంతి, తేజస్విని, లక్ష్మీ సునీత, సాధన, అనూష, శివ పాల్గొన్నారు. అలాగే ఏపీకేంద్ర సహకార బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీసీబీఏ) ఆధ్వర్యంలో డీసీసీబీ సీఈఓ శంకర్‌బాబును సత్కరించారు. బ్యాంకు డీజీఎంలు ఉషారాణి, దయాకర్‌రెడ్డి, మధుసూ. దన్‌రావు, ఏజీఎంలు రమేష్‌బాబు, శ్రీనివాసురెడ్డి, అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి, చంద్రశేఖరరావు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

రొట్టెల పండగ సందడి షురూ

నగరంలోని బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగ సందడి మొదలైంది. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే రొట్టెల పండగ శనివారం నుంచి ప్రారంభం కానుండగా మూడ్రోజుల ముందుగానే భక్తులు తరలివచ్చారు. గురువారం సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వర్ణాల చెరువులో రొట్టెలు మార్చుకున్నారు. బారాషహీద్‌లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.
–నెల్లూరు(బృందావనం)



స్వర్ణాల చెరువులో భక్తజన సందడి



రొట్టెల పండగకు తరలి వస్తున్న భక్తులు



మందస్తుగా రొట్టెలు పట్టుకుంటున్న భక్తులు



రొట్టెల పండగకు ముస్తాబైన బారాషహీద్ దర్గా



రొట్టెలు సిద్ధం చేస్తున్న వ్యాపారులు

రొట్టెల పండగకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

• ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని బారాషహీద్ దర్గాలో ఈ నెల 29 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు జరగనున్న రొట్టెల పండగకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం ఆయన బారాషహీద్ దర్గాలో విద్యుత్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు రొట్టెల పండగ జరిగే ఐదు రోజుల పాటు దర్గా ప్రాంగణంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు మూడు 315 కేవీఏ , ఒక 250 కేవీఏ, ఐదు 160 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. వీటితో పాటు 125 కెపాసిటి కలిగిన జనరేటర్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. 2వేల కేవీఏ సామర్థ్యంతో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. దర్గా ప్రాంగణంలో దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా ఎర్తింగ్ చేసుకోవాలని సూచించారు. రొట్టెల పండగ జరిగే ఐదు రోజుల పాటు ప్రతిరోజూ 29 మంది విద్యుత్ సిబ్బంది ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు, రాత్రి 10 నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు మూడు షిఫ్టులలో విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిషిఫ్టులో నలుగురు డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు, ఐదుగురు అసిస్టెంట్ ఇంజినీర్లు, 20 మంది సిబ్బంది ఉంటారని వివరించారు. దర్గా ప్రాంగణంలో విద్యుత్ రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, అందులో ఒక జూనియర్ ఇంజినీర్, ఇద్దరు డిప్యూటీ ఇంజినీర్లు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎస్ఈ వెంట నెల్లూరుటౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి, డీఈఈ శ్రీధర్, ఏఈ లక్ష్మీనారాయణ ఉన్నారు.



విద్యుత్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటసుబ్బయ్య

జీజీహెచ్‌లో నాలుగు ఆర్వో ప్లాంట్లు

నెల్లూరు(బారకాసు): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వారధి ఫౌండేషన్ దాతృత్వంతో నాలుగు ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్ష్మీసునంద తెలిపారు. గురువారం ఆమె వారధి ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి జీజీహెచ్‌లోని ప్రసూతి కేంద్రంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రసూతి కేంద్రానికి వచ్చే గర్భిణులు, వారి సహాయకులు దాహార్తిని తీర్చేందుకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు వారధి ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆస్పత్రి ఆవరణలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు సైతం నాటడం సంతోషకరమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ పైడమర్రి శ్రీరంగనాథ మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా తాము అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అందులో భాగంగా తాము లక్ష మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే 35వేల మొక్కలు నాటామని, జీజీహెచ్, పాఠశాలలో ప్రాంగణంలో మొక్కలు నాటడం ద్వారా మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. జీజీహెచ్‌కు భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి పరిపాలనాధికారిణి డాక్టర్ కళారాణి, ఫౌండేషన్ కార్యదర్శి ఆర్కాట్ శ్రీనివాసులు, ట్రెజరర్ దరిశి ప్రసాద్‌రావు, ఫాస్ట్ ఎంజేఎఫ్ లయన్ జేవీ మురళి, తదితరులు పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీసునంద, ఫౌండేషన్ ప్రతినిధులు

ముస్లింపాళెంలోని సమస్యల పరిష్కారానికి కృషి

నెల్లూరు(బారకాసు): ముస్లింపాళెం ప్రాంతంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గం, 12వ డివిజన్, వావిలేటిపాడు పరిధిలోని ముస్లింపాళెం ప్రాంతంలో బుధవారం మేయర్ పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు విద్యుత్ స్తంభాలు దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్నాయని మేయర్ దృష్టికి తీసుకురాగా కొత్తవి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు వెలిగేలా చూడాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని, దోమల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మేయర్ వెంట స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



మేయర్‌కు సమస్యలను విన్నవిస్తున్న స్థానికులు

స్వార్థ రాజకీయాల కోసం తప్పుడు సంకేతాలా?

నెల్లూరు(బారకాసు): మణిపూర్‌లో అధిక సంఖ్యలో ఉండే మైతేయి తెగవారికి అన్యాయం జరిగితే, అందుకు భిన్నంగా రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు సంకేతాలు ఇచ్చారని, ఇలాంటి వారిని రాబోయే ఎన్నికల్లో ఓడించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్‌లో క్రిస్టియన్లకు అన్యాయం జరిగినట్లు తప్పుడు సంకేతాలు ఇచ్చినందుకు హిందువులకు భేషరతుగా రూరల్ ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో రెండు తెగలపై జరుగుతున్న అల్లర్లను కమ్యూనిస్టులతో పాటు మరికొందరు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్నారని చెప్పారు. బీజేపీ ప్రభుత్వాన్ని, ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని వాస్తవాలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి క్రిస్టియన్ ఫాదర్‌లతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి క్రిస్టియన్లకు మణిపూర్‌లో అన్యాయం జరిగినట్లు చిత్రీకరించారన్నారు. మణిపూర్‌లో వాస్తవానికి హిందువులు అధిక సంఖ్యలో ఉండే మైతేయి తెగ వారికే అన్యాయం జరిగిందన్నారు. బీజేపీ నేత మిడతల రమేష్ మాట్లాడుతూ మణిపూర్ అల్లర్లను మతాలకు అంటకట్టిన రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వంటి కుహనా వాదులను ఓడించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మణిపూర్ ఘటనలకు క్రిస్టియన్లతో కలిసి మతం రంగు పులిమి తప్పుడు సంకేతాలను సమాజంలోకి పంపినందుకు వెంటనే హిందూ సమాజానికి రూరల్ ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు శ్రీనివాసులు, ప్రవీణ్, ఫణిరాజు, అశోక్‌నాయుడు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.




విలేకరులతో మాట్లాడుతున్న భరత్‌కుమార్‌యాదవ్

నేడు కేన్సర్ ఆస్పత్రిలో వైద్యపరికరాల ప్రారంభం

నెల్లూరు(బారకాసు): పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రిలో నూతన రేడియేషన్ వార్డు, ఐసీయూ విభాగాలతో పాటు రేడియేషన్‌కు సంబంధించిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన లైనియర్‌ఆక్సిలిరేటర్ మెషిన్, సీటీస్కాన్‌ను గురువారం ప్రారంభించనున్నట్లు ఐఆర్‌సీఎస్ జిల్లాశాఖ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారని చెప్పారు. సెంబ్‌కార్ప్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ దాతృత్వం రూ.కోటితో నిర్మించిన 150 కేవీఏ సామర్థ్యం కలిగిన సోలార్ పవర్ సిస్టమ్‌ను ప్రారంభించనున్నట్లు వివరించారు.

గంగమ్మకు పూలంగిసేవ



నెల్లూరు సిటీ: పడారుపల్లిలోని గంగమ్మ దేవస్థానంలో మండలం పూజల సందర్భంగా బుధవారం గంగమ్మకు మల్లెపూలతో విశేషాలంకరణ చేశారు. ఈ సందర్భంగా విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. గంగమ్మసేవకులు శ్రీహరి, శివయ్య, సుబ్బారావు, శేషయ్య, మురళి పాల్గొన్నారు.

నేడు, రేపు నల్లబ్యాడ్జీలతో నిరసన



నెల్లూరు సిటీ: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 27, 28 తేదీల్లో నల్లబ్యాడ్జీలతో భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 16 నెలలుగా పీఆర్‌సీ–2022తో సహా ఇతర న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని యాజమాన్యానికి విన్నవిస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఆందోళనలు చేపడుతున్నామన్నారు. 31న స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు విజ్ఞాపనలు, ఆగస్టు 1న భారీ ర్యాలీలు, 2,3 తేదీల్లో రిలే నిరాహారదీక్ష, 4,5,7 తేదీల్లో నిబంధనల మేరకు పనిచేయడం, 8న విజయవాడలోని విద్యుత్ భవన్ ఎదుట మహాధర్నా, 9న డిపార్ట్‌మెంట్ సిమ్‌కార్డులు అందజేత, 10న నిరవధిక దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి, కన్వీనర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

ప్రగడ కోటయ్యకు నివాళి



నెల్లూరు(బృందావనం): చేనేత కార్మికుల కోసం ప్రగడ కోటయ్య తన జీవితాన్ని త్యాగం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపిన సూరీడని చేనేత సంఘం నేతలు పేర్కొన్నారు. ప్రగడ కోటయ్య జయంతిని పురస్కరించుకుని ట్రంకు రోడ్డు లస్సీ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. చేనేతల సంక్షేమం కోసం ఆయన చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. చేనేత నాయకులు బుధవరపు బాలాజీ, ఆశం సురేష్, నందం అశ్వత్థామ, సోమ గోపాల్, పసల వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ఎన్నికలప్పుడే రాజకీయాలను చూస్తామని, ఇతర సమయాల్లో తాము అభివృద్ధి పైనే దృష్టి కేంద్రీకరిస్తామని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. 27వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సన్నపురెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ రానున్న ఎన్నికల లోపు అభివృద్ధి పనులు పూర్తిచేయడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం వచ్చాక డివిజన్‌లో రూ.4కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. మిగిలిన అభివృద్ధి పనులు పూర్తిచేయడానికి కృషి చేస్తామన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతికి తావులేకుండా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని వివరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను ఆదర్శంగా తీసుకుని దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు పీ రవి, నాయకులు ఏసునాయుడు, హరిబాబుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ ప్రదేశాలు ఇవే..

నెల్లూరు(క్రైమ్): నగరంలోని బారాషహీద్ దర్గాలో ఈ నెల 29 నుంచి జరుగనున్న రొట్టెల పండగకు దేశ, విదేశాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతోంది. నగరంలోని పది పార్కింగ్ ప్రదేశాలను గుర్తించింది. ఇందుకు సంబంధించిన వివరాలను నగరంలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ తిరుమలేశ్వర రెడ్డి బుధవారం వివరాలను వెల్లడించారు. నిర్దేశించిన ప్యారింగ్ ప్రదేశాల్లోనే భక్తులు వాహనాలను నిలపాలని ఎస్పీ సూచించారు. భక్తులు పార్కింగ్ ప్రదేశాలను కనుగొనేందుకు క్యూఆర్ స్కాన్‌ను తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. దీని ద్వారా భక్తులు పార్కింగ్ ప్రదేశాలకు సులభంగా వెళ్లవచ్చన్నారు. దర్గా పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు రాకపోకలు సాగించేందుకు వీలుగా పాసులు మంజూరు చేస్తామని తెలిపారు.

- బెంగళూరు, చెన్నై, తిరుపతి వయా గూడూరు మీదుగా నెల్లూరుకు వచ్చే లారీలు, టెంపోలు, బస్సులు, కారులు, ఆటోలు, మినీ వ్యాన్‌లకు జీజీహెచ్ ప్రాంగణం, డిమార్ట్ సమీపంలోని సైన్స్‌పార్కు వద్ద పార్కింగ్ సౌకర్యం కల్పించారు. బుజబుజనెల్లూరు, అయ్యప్పగుడి, వేదాయపాళెం, కరెంటాఫీసు మీదుగా జీజీహెచ్‌కు చేరుకోవచ్చు. బుజబుజనెల్లూరు, అయ్యప్పగుడి, అయ్యప్పగుడి ఫ్లైఓవర్, బీవీనగర్, అన్నమయ్యసర్కిల్, మాగుంటలేఅవుట్ మీదుగా సైన్స్‌పార్కుకు చేరుకోవచ్చు.
- విజయవాడ, గుంటూరు, ఒంగోలు, కావలి వైపు నుంచి వచ్చే వాహనాలకు ఎస్వీజీఎస్ మైదానంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి మీదుగా వచ్చి ఎస్వీజీఎస్ మైదానానికి చేరుకోవచ్చు.
- బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు వైపు నుంచి వచ్చే లారీలు, టెంపోలు, బస్సులకు డీమార్ట్ సమీపంలోని సైన్స్‌పార్క్, ఆటోలు, కారులు, మినీ వ్యాన్‌లు, టెంపోలకు వీఆర్సీ, వైఎంసీఏ గ్రౌండ్స్‌లో పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. ఆత్మకూరు బస్టాండ్ ఫ్లైఓవర్, రామలింగాపురం ఫ్లైఓవర్, బెజవాడ గోపాల్‌రెడ్డి విగ్రహం, అన్నమయ్యసర్కిల్, మాగుంటలేఅవుట్ మీదుగా సైన్స్‌పార్కు చేరుకోవచ్చు. మినీ వాహనాలు నగరంలో నుంచే వీఆర్సీ, వైఎంసీఏ గ్రౌండ్‌కు చేరుకోవచ్చు.
- అనంతపురం, కడప, బద్వేలు తదితర ప్రాంతాల నుంచి వయా జొన్నవాడ మీదుగా వచ్చే లారీలు, టెంపోలు, బస్సులకు ఇరుకళలపరమేశ్వరి దేవస్థానం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం, డీఎస్ఎన్ మినీ ఫంక్షన్ హాల్ వద్ద పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు కారులు, ఆటోలు, టెంపోలు, మినీవ్యాన్‌లకు కస్తూరిదేవిగార్డెన్స్ ఎదురుగా ఉన్న ఎస్వీజీఎస్ స్థలంలో పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. జొన్నవాడ, ఇరుకాళమ్మ సంఘం, నీలగిరి సంఘం, బట్వాడిపాళెం సెంటర్ మీదుగా కస్తూరిదేవి గార్డెన్స్‌కు చేరుకోవచ్చు.
- కడప, రాజంపేట, రాపూరు, పొదలకూరు మీదుగా వచ్చే లారీలు, టెంపోలు, బస్సులకు తెలుగుగంగ కాలనీ సమీపంలోని ఆల్‌ఇండియా రేడియో స్టేషన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో, కార్లు, మినీ వాహనాలకు పొదలకూరురోడ్డులోని జెడ్పీబాలికల పాఠశాలలో పార్కింగ్ ఏర్పాటు చేశారు.

రెగ్యులర్ వాహనాల దారిమళ్లింపు..

- చెన్నై, బెంగుళూరు, తిరుపతి, గూడూరు వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను అయ్యప్పగుడి ఫ్లైఓవర్, బీవీనగర్, అన్నమయ్య సర్కిల్, ఆర్ఎల్‌పురం, రామలింగాపురం అండర్‌బ్రిడ్జి, ఏసీమార్కెట్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుంటాయి.
- పొదలకూరు రోడ్డు సర్కిల్ వైపు నుంచి వచ్చే బస్సులు కొండాయపాళెం గేట్, కిమ్స్ హాస్పిటల్, కేవీఆర్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుంటాయి.
- జొన్నవాడ నుంచి వచ్చే బస్సులను ములుముడి బస్టాండ్ మీదుగా బస్టాండ్‌కు దారి మళ్లించారు.
- బట్వాడిపాళెం నుంచి పోలీసు ఆఫీసు మీదుగా వెళ్లే వాహనాలను మూలాపేట మీదుగా దారి మళ్లించారు.
- కేవీఆర్ పెట్రోల్‌బంకు వైపు నుంచి పోలీసు ఆఫీసు మీదుగా వెళ్లే వాహనాలను మూలాపేట వైపు దారిమళ్లించారు. ఈ రహదారిగుండా రాకపోకలను పూర్తిగా నిషేధించారు.
- రొట్టెల పండగ ముగిసే వరకు నగరంలోకి భారీ వాహనాలను నిషేధించారు.

జిల్లాలోని మత పీఠాధిపతులకే అవకాశం కల్పించాలి

నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గా గంధ మహోత్సవాన్ని జిల్లా మత పీఠాధిపతుల ఆధ్వర్యంలోనే నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ సంఘ సమన్వయకర్త కేఎస్ఎస్ బాబాసాహెబ్ బందానవాజ్ డిమాండ్ చేశారు. నగరంలో చిన్నబజార్‌లోని ఖాజాపీర్ దర్గా షెహన్షా మసీదులో బుధవారం నిర్వహించిన నెల్లూరు జిల్లా ముస్లిం మత పీఠాధిపతుల సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. బారాషహీద్‌దర్గా గంధ మహోత్సవాన్ని జిల్లా మత పీఠాధిపతుల ఆధ్వర్యంలోనే నిర్వహించాలని తామెంతో కాలంగా ప్రభుత్వానికి విన్నవిస్తున్నా ఆ దిశగా ఇప్పటి వరకు ఎటువంటి ఆలోచన చేయలేదన్నారు. గంధ మహోత్సవం నిర్వహణ బాధ్యతలను జిల్లాతో సంబంధం లేని ఇతర జిల్లాల వారికి అప్పగిస్తున్నారన్నారు. దీనిపై తాము అభ్యంతరం తెలుపుతూ న్యాయస్థానం ద్వారా నోటీసులు పంపామన్నారు. గంధమహోత్సం నిర్వహణ అనుమతులను స్థానిక పీఠాధిపతులకు ఇవ్వాలని కోరామన్నారు. పీఠాధిపతి సయ్యద్ యూసుఫ్ హుస్సేనీ మాట్లాడుతూ ఎంతో పవిత్రంగా నిర్వహించాల్సిన గంధమహోత్సవంలో అపవిత్రత జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో పీఠాధిపతి మొహ్మద్ ఇస్తియాఖ్ అలీ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ఈ విషయంలో తక్షణమే స్పందించాలన్నారు. జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా మత పీఠాధిపతులు అన్వర్‌బేగ్ మంజూరు, రఫీ, సమీవుల్లాఖాన్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న బాబాసాహెబ్ బందనవాజ్

ఘనంగా కార్గిల్ విజయ్ దివాస్



నారాయణలో కమెండో శ్రీనివాసులుకు సత్కారం



జీవీఆర్ఆర్‌లో ..

నెల్లూరు (టౌన్): నగరంలోని జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత వింగ్ కమాండర్ శ్రాంప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్గిల్ యుద్ధ విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్గిల్ ప్రాంతాన్ని రక్షించేందుకు భారత సైనికులు యుద్ధం చేసి 1999 జులై 26న విజయం సాధించారని తెలిపారు. కార్గిల్ యుద్ధంలో 537 మంది ప్రాణాలర్పించగా, వేలాది మంది సైనికులు గాయాలపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఎన్ఎస్ఎస్ పీఓ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు వెంకటరావు, బాలాజీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ'లో..

నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. పారా కమాండో, హెవెల్డర్ శ్రీనివాసులు, విశ్రాంత 321 ఫీల్డ్ రెజిమెంట్ కిశోర్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్గిల్ యుద్ధంలో అమరులైన 527 మందిని స్మరించుకున్నారు. ఎంసీఏ విభాగ ప్రొఫెసర్ వరప్రసాద్, ఈసీఈ విభాగాధిపతి మురళి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి చంద్రమోహన్‌రెడ్డి, ప్రొఫెసర్ విజయలక్ష్మి,, మోటివేటర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.